సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కాలేజీ ఎదుట ఆందోళన



కళాశాల ఎదుట ఆందోళన చేపడుతున్న విద్యార్థి సంఘం నేతలు

సుభాష్‌నగర్: లక్షల్లో ఫీజులు వసూలు చేసి, ఇప్పుడు సీట్లు లేవని కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల యజమాన్యం చేతులెత్తేయడంతో కాలేజీ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇచ్చిన డబ్బులు వెనక్కి తీసుకోవాలని యాజమన్యం కోరడంతో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు వారితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాలు అక్కడికి చేరుకుని వారికి మద్దతుగా ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థి సంఘాల నాయకులను లోనికి వెళ్లకుండా గేట్ వద్ద అడ్డుకున్నారు. దీంతో నాయకులు యాజమాన్యం తీరును నిరసిస్తూ అర్ధనగ్నంగా కళాశాల గేటు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ అధ్యక్షుడు పోతుల రమేష్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగం గౌడ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు మేనేజ్‌మెంట్ కోటాలో సీటు ఇస్తామని చెప్పి లక్షలు వసూలు చేసి ఇప్పుడు సీట్లు లేవని చెప్పి డబ్బులు, సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని చెప్పడం దారుణమన్నారు. దీంతో విద్యార్థులు సంవత్సరం పాటు విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తక్షణమే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు ప్రతాపరెడ్డి, లెనిన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల డీన్ రామచంద్ర మాట్లాడుతూ పై నుంచి సీట్లు రాకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని తెలిపారు.

భగత్‌సింగ్‌నగర్‌వాసుల ఆందోళన

చింతల్: రక్షణ చర్యలు లేకుండా తమ బస్తీ నుంచి విద్యుత్ లైన్లను తీసుకెళ్లవద్దని భగత్‌సింగ్‌నగర్ వాసులు శనివారం ఆందోళనకు దిగారు. చింతల్ డివిజన్ పరిధిలోని స్టార్‌లైట్ అపార్ట్‌మెంట్ పక్కన ఓ భారీ బహుళ అంతస్తుల భవనాలకు భగత్‌సింగ్ నగర్ సబ్ స్టేషన్ నుంచి 2000 మెగా వాట్లతో 33/11 కేవీ విద్యుత్ లైన్‌ను వేసేందుకు ఆ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించి ఇటీవల స్తంభాలకు కందకాలు తీశారు. విషయం తెలుసుకున్న భగత్‌సింగ్‌నగర్ వాసులు చిన్న గల్లీల్లో భారీ లైన్లు వెళ్తే రానున్న రోజుల్లో జరిగితే ప్రమాదాలకు ఎవరూ బాధ్యులని అడ్డుకున్నారు. కాగా అక్కడ చేపట్టిన నిర్మాణాలకు గతంలో ప్రాగా సబ్‌స్టేషన్ నుంచి కనెక్షన్లు ఉండగా ఖర్చు భారీగా పెరుగుతుండడంతో అధికారులు, సదరు అపార్ట్‌మెంట్ నిర్మాణ సంస్థలు కలిసి పక్కనే ఉన్న భగత్‌సింగ్‌నగర్ సబ్‌స్టేషన్ మీదుగా లైన్లు వేయాలని ప్రణాళికలు రూపొందించారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇదే అపార్ట్‌మెంట్‌కు ప్రాగా సెక్షన్ నుంచి గతంలోనే విద్యుత్ లైన్లు వేయాలని రంగానగర్ మీదుగా ఎస్టిమేషన్ రూపొందించగా వారు సైతం అడ్డుకున్నట్లు భగత్ సింగ్‌నగర్ వాసులు వాపోతున్నారు. కాగా ఈ విషయమై అటు విద్యుత్ అధికారులు, భగత్‌సింగ్‌నగర్ వాసులు జీడిమెట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.



విద్యుత్ అధికారులతో వాగ్వాదానికి దిగిన భగత్‌సింగ్‌నగర్ వాసులు

జీఆర్ఐఈటీలో ఘనంగా 24వ గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న విద్యార్థులు

నిజాంపేట్: బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల (జీఆర్‌ఐఈటీ)లో శనివారం 24వ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఇన్ఫైట్ సాఫ్ట్‌వేర్ వైస్ ప్రెసిడెంట్ చీమలకొండ హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తమ స్కిల్స్‌ను పెంపొందించుకుని తద్వారా అత్యుత్తమ అవకాశాలు అంది పుచ్చుకోవాలన్నారు. డిగ్రీ పట్టా పొందిన విద్యార్థుల నిజమైన లెర్నింగ్ ఇప్పుడే మొదలైందని వారు తగురీతిలో నిత్య విద్యార్థులుగా శ్రమిస్తేనే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చన్నారు. ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ద్వారా చాలా ఇండస్ట్రీలో మెరుగైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ జుగ్గే, సీఎస్‌ఈ విభాగ అధిపతి డాక్టర్ శంకరబాబు, కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ చార్లెస్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాష్ ఆయిల్ అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

మోతీనగర్: ఎక్కువ డబ్బులు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశంతో హష్(గంజాయి) ఆయిల్ అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ సామల వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం.. అల్లాపూర్ లక్ష్మీనగర్‌లో నివాసముండే మేకల లీల వెంకట శివరాం (25) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గంజాయి అమ్మి జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. తనకు పరిచయం ఉన్న హష్ ఆయిల్‌ను అమ్మే నూతక్కి సనీత్(సన్నీ) వద్ద కొంతకాలంగా ఆయిల్‌ను కొని మాదాపూర్, పర్వత్‌నగర్లో తెలిసిన వారికి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు 23వ తేదీన సాయంత్రం 5 గంటలకు మేకల లీల వెంకట శివరామ్ రూమ్‌పై దాడి చేశారు. హష్ ఆయిల్‌తో పాటు శివరాంను, కొనడానికి వచ్చిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 40 బాటిళ్ల హష్ ఆయిల్, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నూతక్కి సనీత్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హష్ ఆయిల్ అమ్ముతున్న వ్యక్తిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నందుకు అల్లాపూర్ పోలీసులను, సిబ్బందిని కూకట్‌పల్లి అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రావు అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కూకట్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కేపీహెచ్‌బీ ఎస్‌ఐ లింగయ్య అన్నారు. జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. దిలీప్, డాక్టర్ అశోక్, జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహుల్, చంద్రశేఖర్, రంజిత్, సిద్ధార్థ, బ్రహ్మం, కుమార్‌రెడ్డి, అశ్వత్, అనీష్‌గౌడ్, రోహిత్, కృష్ణ, శివ పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

కేపీహెచ్‌బీకాలనీ: భార్యాభర్తలు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేపీహెచ్‌బీ పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీలోని సూర్యా రెసిడెన్సీలో నివాసం ఉండే ఉషారాణి (55) నాగమల్లేశ్వరరావులు భార్యాభర్తలు. ఈ నెల 18న ఉదయం 5:30 గంటలకు కల్వరి టెంపుల్‌కు స్కూటీపై బయలుదేరారు. బ్రాండ్ ఫ్యాక్టరీ చౌరస్తా వద్ద గుర్తు తెలియని కారు స్కూటీని ఢీకొట్టింది. గాయాలైన భార్యాభర్తలను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. నాగమల్లేశ్వరరావు కోలుకున్నాడు. ఉషారాణికి మెరుగైన చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

విద్యాసంస్థల్లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి

నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. చిన్నారులు కృష్ణులు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. అలాగే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టిని కొడుతూ సందడి చేశారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. – కుత్బుల్లాపూర్



సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యామందిర్‌లో..



ఎస్పీఆర్ స్కూల్‌లో వేషధారణలో చిన్నారులు



వేంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లేస్కూల్‌లో..



అపురూపకాలనీ టీవీఆర్ మోడల్ హైస్కూల్‌లో..

ఉద్రిక్తంగా అక్రమ నిర్మాణాల కూల్చివేత

పోలీసు బందోబస్తు మధ్య తొలగించిన అధికారులు

సుభాష్‌నగర్: జీహెచ్‌ఎంసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఓ ఇంటిని కూల్చడం ఉద్రిక్తతకు దారితీసింది. సుభాష్‌నగర్ డివిజన్ సురారం సుందర్‌నగర్ వద్ద డబుల్ రిజిస్ట్రేషన్ ఫ్లాట్‌లో అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని రజిత అనే మహిళ 2017లో హైకోర్టును ఆశ్రయించింది. దీంతో ఆ ఇంటిని కూల్చి సంబంధిత ఓనర్స్‌కు ఫ్లాట్‌ను అప్పగించాలని కోర్టు జీహెచ్‌ఎంసీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో కుత్బుల్లాపూర్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ నరసింహ నేతృత్వంలో శనివారం ఉదయం, సూరారం సీఐ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీలతో అక్రమ నిర్మాణాన్ని కూల్చేందుకు వచ్చారు. అయితే మహమూద్ కుటుంబ సభ్యులు తాము డబ్బులు పెట్టి ఇల్లు కట్టుకుంటున్నామని, ఎలా కూలుస్తారని..? అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల ప్రొటెక్షన్ సహాయంతో వారిని చెదరగొట్టి అక్రమ నిర్మాణాన్ని నేల మట్టం చేశారు.



ఇంటిని కూలుస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఖాళీ పేపర్ పై సంతకం చేయించుకుని..

సదరు స్థలం తమదని కొంతమంది కోర్టుకు వెళ్లగా ఈ విషయమై కోర్టులో పేర్కొన్న ఇంటి నంబర్, తమ ఇంటి నెంబర్‌కు సంబంధం లేదంటూ, తాము కూడా కోర్టును ఆశ్రయించామని ఇంటి యజమాని మహబూబ్ తెలిపారు. రెండు నోటీసులు తనకు అందాయని, మూడో నోటీసు తనకు ఇవ్వకుండానే అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారి సాయిబాబా పిలిపించుకుని న్యాయం జరిగేలా చూస్తానని చెప్పి ఖాళీ పేపర్‌పై సంతకం చేయించుకున్నాడని, ఇంతలో ఇది జరిగిందని అతను వాపోయాడు. ఇటీవలే ఈ స్థలంపై రూ.30 లక్షల బ్యాంక్ లోన్ తీసుకుని ఇల్లు కట్టానని, ఇప్పుడు తన పరిస్థితి ఏంటని వాపోయాడు.

మహాదేవపురం ప్రధాన రోడ్డుపై..

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురం ప్రధాన రోడ్డుపై వెలసిన అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం తొలగించారు. కూకట్‌పల్లి షాపూర్‌నగర్ కలిపే ఈ రోడ్డులో మహాదేవపురం వద్ద పలువురు వ్యాపారులు 20 ఫీట్ల వదరకు ముందుకు నిర్మాణాలు చేపట్టడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఈ నెల 8న కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారి నరేశ్ నేతత్వంలో 4 నిర్మాణాలను జేసీబీతో కూల్చివేశారు. మిగితా నిర్మాణాలను కూడా త్వరలో కూల్చివేస్తామని వారు తెలిపారు.



జేసీబీతో నిర్మాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

అన్నదానం

జగద్గిరిగుట్ట: చింతల్, శ్రీసాయికాలనీలోని అభయాంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణాల్లో శనివారం అన్నదానం నిర్వహించారు. ప్రతి శనివారం (66 వారాలుగా) శ్రీ హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నెకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కల్యాణ్ రావు పాటిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నారు.

చకచకా నాలా పనులు..!



గణేశ్‌నగర్‌లో తుదిదశకు చేరిన పనులు

జగద్గిరిగుట్ట: చింతల్, గణేశ్‌నగర్ నాలా విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి. రూ.కోటి 80 లక్షలతో జూన్‌లో పనులు చేపట్టారు. యేటా వానకాలంలో ఇండ్లలోకి వరద చేరి స్థానికులు చాలా ఇబ్బందులు పడేవారు. అయితే ఈ నాలా విస్తరణ పనులతో పాటు రిటైనింగ్ వాల్ పనులు పూర్తి కానుండడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెగా లోక్ అదాలత్‌కు స్పందన



హాజరైన వాహనదారులు

కుత్బుల్లాపూర్: మేడ్చల్‌లోని దీవాన్ కన్వెన్షన్ హాల్‌లో మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ పరిధిలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన వచ్చింది. అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 220 కేసులు, మేడ్చల్ పరిధిలో 198, జీడిమెట్ల పరిధిలో 105 కేసులున్న వాహనదారులు హాజరు కాగా మేడ్చల్ పదో ఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ హేమలత జరిమానా విధించి వాహనాలను అప్పగించారు. మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, ట్రాఫిక్ సీఐలు హనుమాన్‌గౌడ్, నాగరాజు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లపొదల్లోకి కారు



సుభాష్‌నగర్: కారు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఘటన దూలపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్ 08 హెచ్‌వీ 4624 నంబర్ గల కారు శనివారం మధ్యాహ్నం బహదూర్‌పల్లి నుంచి కొంపల్లి వైపు వస్తుంది. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ వద్దకు రాగానే మూల మలుపు వద్ద అదుపుతప్పి చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. అయితే అదే సమయానికి బెలూన్లు ఓపెన్ కావడంతో ప్రాణనష్టం తప్పింది. అతి వేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.. ఈ మలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ పనులపై దృష్టి సారించాలి



అధికారులతో సమావేశమైన మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: పెండింగ్ పనులపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. కమిషనర్ రామకృష్ణరావు, మేనేజర్ పవన్‌కుమార్‌తో కలిసి ఆయా విభాగాల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో మురుగునీటి కాలువలు, డ్రైనేజీ, రోడ్లు వంటి సదుపాయాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో ఎంటమాలజీ సిబ్బంది దోమల వృద్ధిని నిరోధించడానికి ఫాగింగ్, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, అదేవిధంగా రోడ్ల వెంబడి పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించాలని మేయర్ సూచించారు. సమావేశంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, మాన్సూన్ సిబ్బంది పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీ కళాశాలలో పరిచయ కార్యక్రమం

నిజాంపేట్: బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ కళాశాలలో శనివారం బీటెక్ ఫస్టియర్ విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఆదిత్య విస్సం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ విద్యార్థులు పరిశ్రమలకు తగ్గట్టుగా తమ నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. కళాశాల వైస్ చైర్మన్ రవిచంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తూ ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేలా తర్ఫీదునిస్తున్నామని, ఈ సంవత్సరం నుంచి విష్ణు సక్సెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను కొత్తగా చేరిన విద్యార్థులతో పంచుకున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య విస్సం తదితరులు

పార్కు స్థలాలను పరిరక్షించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

దుండిగల్: పార్కు స్థలాలు కబ్జాకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుండిగల్ మున్సిపల్ పరిధి భౌరంపేట్ సింహపురి కాలనీలోని ఏ బ్లాక్ 122వ ప్లాట్ బిల్డింగ్‌కు ఆనుకుని ఉన్న పార్కు స్థలాన్ని కబ్జా చేశారని, ప్రీ కాస్ట్ వాల్ నిర్మించారన్నారు. గతంలో అక్కడ భౌరంపేట్ గ్రామ పంచాయతీ పార్కు బోర్డు ఏర్పాటు చేయగా దాన్ని తొలగించారన్నారు. సదరు స్థలాన్ని కాపాడి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పీసరి కృష్ణారెడ్డి, దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, సర్గాని సత్తిరెడ్డి, సీతారాంరెడ్డి కాలనీవాసులు ప్రమోద్ కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

టాయిలెట్లు కంపు..కంపు...!

గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల కార్యాలయాల్లో అధ్వానంగా టాయిలెట్స్

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్యాలయాల్లోని టాయిలెట్స్ అధ్వానంగా మారాయి. దీంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించే అధికారులు.. వాటిని మాత్రం పట్టించుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అందులోకి వెళ్లాలంటే ముక్కు మూసుకోనిదే వెళ్లలేని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కేవలం తమ చాంబర్లో ఉండే మూత్రశాలల నిర్వహణ చేపడుతూ ప్రజలు ఉపయోగించే వాటిని మాత్రం గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇందులో కొన్ని మూత్రశాలల డోర్లు ఊడిపోగా, మరికొన్ని ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి పడేశారు. నల్లాలు సరిగా పనిచేయకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు ఉపయోగపడేలా వాటికి మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.





కుత్బుల్లాపూర్, గాజులరామారం కార్యాలయ ఆవరణలో అపరిశుభ్రంగా మూత్రశాలలు

'ఆరోపణలు అవాస్తవం'

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లిలోని సర్వేనంబర్ 131 ప్రభుత్వ స్థలంలో తాను ప్లాట్లు చేసి అమ్ముకున్నానని 14వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ చేసిన ఆరోపణలు అవాస్తవం అని దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు అన్నారు. రాహులే డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పిస్తానని సూరారం, దూలపల్లి బాదురుపల్లికి చెందిన పలువురు అమాయకుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేశారని, ఆ బాధితులు తన వద్దకు వచ్చి వాపోయారని తెలిపారు. అదేవిధంగా స్థానికంగా కూడా పలువురిని బ్లాక్‌మెయిల్ చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నాడని ఆరోపించారు. అతని చిట్టా తయారు చేస్తున్నామని త్వరలోనే అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పద్మారావు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేద ప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పొందుతున్నారని బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదేశాల మేరకు శంభీపూర్‌లోని పార్టీ కార్యాలయంలో 54 మంది లబ్ధిదారులకు రూ.21.27 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ గతేడాది ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన చెక్కులను అందజేశామన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులతో అక్షరభాస్యం చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

దుండిగల్: పోషకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి రేణుక అన్నారు. గాజులరామారం డివిజన్ రోడామేస్త్రీ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శనివారం అక్షరభాస్యం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ కేంద్రాల్లో అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్పందన, అంగన్‌వాడీ టీచర్ మతిన్ సుల్తానా, సుశీల, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్ఎంటీ వాకో హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

చింతల్: చరిత్రాత్మక హెచ్ఎంటీ వాకో హైస్కూల్ 1999 బ్యాచ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలను శనివారం హెచ్ఎంటీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంటీ కాలనీలోని ప్రస్తుతం ఉన్న వాక్సన్ స్కూల్ ఆవరణలో సంప్రదాయ పాఠశాల అసెంబ్లీతో ప్రారంభమయ్యాయి. 20 మందికి పైగా నాటి గురువులతో పాటు పూర్వ విద్యార్థులు హాజరై తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం విద్యార్థులు తమ పూర్వ ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రతి విద్యార్థి, టీచర్కు గ్రూప్ ఫొటో మెమొంటోను అందజేశారు. సాయంత్రం అల్పాహారం అందించారు.

ఎస్వీ కృష్ణారెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సర్పారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: భౌరంపేట మాజీ సర్పంచ్ ఎస్వీ కృష్ణారెడ్డి 57వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామాభివృద్ధికి కృష్ణారెడ్డి చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్పారెడ్డి భూపతిరెడ్డి, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మిద్దెల యాదిరెడ్డి, బుచ్చి రెడ్డి, సురేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకట్ ముదిరాజ్ పాల్గొన్నారు.

కూలిన పార్కు ప్రహరీ



కూలిన గోడను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రశాంతి హిల్స్‌లోని పార్కు ప్రహరీ శనివారం అకస్మాత్తుగా కూలిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక ఏఈ, బీజేపీ పార్లమెంట్ కో.కన్వీనర్ రాజు, జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిధులు మంజూరు చేయించి వెంటనే మళ్లీ ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఏఈని కోరారు. కాలనీవాసులు ఉమామహేశ్, నాగు, ప్రసాద్, అనిల్, నాయడు, నిరంజన్, శివరామ్ తదితరులు ఉన్నారు.

నవవధువు ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: ప్రేమించి పెళ్లి చేసుకున్న నవ వధువు అత్తగారింటి వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కాంత్రి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట రిక్షాపుల్లర్స్ కాలనీకి చెందిన కృష్ణ కుమార్తె మనీషా (26) అదే ప్రాంతానికి చెందిన రాజశేఖర్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. గత నెల 10వ తేదీన వివాహం చేసుకున్నారు. అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో రాజశేఖర్ జైలుకు వెళ్లి వచ్చాడు. అనంతరం మనీషా అత్తగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన మనీషా యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మనీషా తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.